**కథ**

# సంక్రాంతి అల్లుడు

## సుసర్ల సుధ

సుబ్బారావుని బావమరిది పండక్కి రమ్మని పిలిచాడు. భార్యతో సహా అత్తవారింటికి వెళ్ళటానికి రెడీ అయ్యాడు అతను. తల్లి సుభద్రమ్మ మార్కెట్‌కి వెళ్ళింది. క్రొత్తగా పెళ్ళయిన చెల్లెలు తాయారు, భర్త జనార్ధనం పండక్కి వాళ్ల అత్తవారిల్లయిన సుబ్బారావింటికి వస్తున్నారు.

కోడలు రాధ బాగ్‌లు తెచ్చి గేటు దగ్గర పెట్టింది. తలుపుకి తాళం వేసి, తాళం చెవులు చేత్తో పట్టుకుని అటూ ఇటూ తిరుగుతున్నాడు సుబ్బారావు.

''ఏమిటండీ తాళం చెవులు పట్టుకుని అలా కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నారు'' అంది ఆశ్చర్యంగా.

''మా చెల్లెలు, బావా రాగానే తాళం చెవులు వాళ్ళ చేతుల్లో పెట్టటానికే. మనకి ట్రైన్ టైమయిపోతున్నది కదా!'' అన్నాడు, కీ చెయిన్‌తో గుండ్రని పరిధి చేస్తూ త్రిప్పుతూ.


''చీటీ మీద వ్రాసి తలుపు సందులో పెట్టండి, తాళం చెవి గూట్లో పెట్టామని'' అంది గట్టిగా అరుస్తూ.

''గట్టిగా అరవకే ఎవరైనా విని, కొంపంతా దోచేస్తారు''

ఆ మాట విని ఇంకా గట్టిగా స్వరం పెంచి, ''ఆ, మనింట్లో ఏమున్నాయిలెండి దొంగతనం చేయటానికి? బీరువాలో ఎడం ప్రక్క వెండి కంచం, కుడివైపు వడ్డాణం, కాసుల పేరు మీ అమ్మగారివే ఉన్నాయి. ఇంకా చిన్నా చితకా బంగారు గొలుసులు, ఉంగరాలు అన్నీ ఉన్నాయనుకోండి'' అంది ప్రక్కనే ఉన్న గుమ్మం చివర కూర్చుంటూ.

''ఓసి నీ మొహం మండా! ఏవేవి ఎక్కడ ఉన్నాయో కూడా అరిచి చెప్పాలా, నోరుముయ్యవే! పద, టైమయిపోతోంది'' అన్నాడు పళ్ళు బిగించి, కళ్ళెర్రజేసి.

అంతలో వాకిట్లో ఆటో ఆగిన చప్పుడైంది. అటు తలత్రిప్పి చూశారిద్దరూ. చెల్లెలు



తాయారూ, బావ జనార్ధనం ఆటోలోంచి దిగి లోపలికి వచ్చారు.

సుబ్బారావు మొహం వెయ్యి క్యాండిల్ బల్బులా వెలిగిపోయింది.

''అమ్మయ్యా వచ్చారా! రండి రండి, మేము వెళ్ళాలి. మీరింకా రాలేదు. అమ్మేమో యింట్లో లేదు. ఎలాగా అనుకుంటున్నాం. సరే, ఇదిగో తాళం చెవి'' అని చెల్లెలి చేతికిచ్చాడు.

తామిద్దరినీ పండక్కి రమ్మని పిల్చి, వీళ్ళెక్కడికి వెళ్ళిపోతున్నారు అని అనుమానం వచ్చింది.

ఇద్దరూ ఒక్కసారే అడిగారు. ''మీరెక్కడికి వెళ్ళిపోతున్నారు?'' అని భుజాన ఉన్న బ్యాగ్‌లు క్రింద పెట్టారు.

''ఏం లేదు బావా! మా బావమరిది కూడా

పండక్కి పిలిచాడు వాళ్ళింటికి రమ్మని. హైదరాబాదు వెళుతున్నాం. నాన్నగారు ఊళ్ళో లేరనుకో, అమ్మ ఉంటుందిలే. మీరిద్దరూ ఏమీ మొహమాట పడకుండా పిండివంటలన్నీ ఆరగించి మమ్మల్ని తరింపజేయండి. అమ్మ చేతివంట తింటే అంతేమరి ఇహ.. నేనేం చెప్పలేను'' అన్నాడు.

చెల్లెలి వైపు తిరిగి, ''చెల్లాయ్! ఆరోగ్యం జాగ్రత్త. బావని జాగ్రత్తగా చూసుకో. అసలే జిహ్వా చాపల్యం మనిషి'' అంటూ విషాదంగా ముఖం పెట్టాడు.

చివరగా, ''సరే, ఉంటాం. రా రాధా బండికి లేటవుతుంది'' అని ఆటో పిల్చి, సామాన్లు తీసుకున్నాడు.

ఇద్దరూ కూర్చోగానే ఆటో బయల్దేరింది.

వాళ్ళలా వెళ్ళగానే, వీళ్ళిద్దరూ కుర్చీలో నీరసంగా చతికిలబడిపోయారు.

ఈలోగా సుభద్రమ్మగారు బుట్టనిండా తోటకూరతో యింట్లో అడుగు పెట్టేంది. నీరసంగా కుర్చీల్లో వాలిపోయి ఉన్న కూతుర్నీ అల్లుణ్ణీ చూసి గాభరాగా అంది.

''ఎప్పుడొచ్చారు నాయనా? కులాసాయేనా? ఏమే అమ్మాయ్! బాగున్నావా? వీళ్ళు వెళ్ళారా?'' అంటూ గబగబా అడిగేసింది.

''ఆ! వెళ్ళారుగానీ, ఇదేమైనా బాగుందటే! మమ్మల్ని రమ్మని పిల్చి నాన్న వూళ్ళోనే లేరు. ఉన్నవాళ్ళు కూడా వెళ్ళిపోయారు. అటువంటప్పుడు మమ్మల్నెందుకు పిల్చినట్టు'' కూతురు తాడి ప్రమాణాన లేచి అరిచింది.

''ఏం చేస్తామమ్మా వాళ్ళ బావమరిది రాకపోతే వీల్లేదని ఒట్టు కూడా పెట్టుకున్నాడుట. నేను లేనటే'' అంది.

''సరే, కాఫీ టిఫిన్లేమైనా ఉన్నాయా? నీరసంగా, బడలికగా ఉంది. మేం స్నానం చేసి వచ్చేసరికి తయారుచేసి అట్టేబెట్టు. వచ్చి తింటాం'' అంది తాయారు.

''అత్తగారేదో పెద్ద లెవెల్లోనే చేసుంటారు తాయారూ. నువ్వొరికే కంగారుపడకు. తెచ్చేదాకా కొంచెం ఓపిక పట్టు'' అన్నాడు భార్యకేసి చూసి.

''ఏమిటో నాయనా! వారం రోజుల నుంచి ప్లాన్ చేస్తున్నాను. మీకు అవి చేయాలి, ఇవి చేయాలి అని'' అంది సుభద్రమ్మగారు కొంగు కప్పుకుంటూ.

''అహ్హహ్హా...!'' అని ఓసారి వికటాట్టహాసం చేసి భార్య వైపు గర్వంగా చూశాడు జనార్దనం.

ఆ నవ్వు చూసి భయపడుతున్న అత్తగారితో, ''ఇంతకూ ఏం చేశారత్తగారూ?'' అని అడిగాడు.

సావకాశంగా చెప్పాలని తను ఓ కుర్చీలో కూలబడుతూ ''బాబూ! యిడ్లీలు చేద్దామని పప్పు నానబెట్టాను. దోశలైనా చేయొచ్చని బియ్యం కూడా నానబెట్టాననుకో. ఎందుకైనా మంచిది పెసలు కూడా నానబెట్టాన్లే. ఏమిటే? ఉల్లిపాయ, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర బాగా దట్టించి వేడి వేడిగా వడ్డించాలని. తీరా చేస్తే ఏమైందో తెలుసా?'' అని ఓ క్షణం ఆగి తెల్లబోయి చూసింది కూతురి వైపు.

ఏమిటన్నట్లు చూసింది తాయారు స్నానం చేసి, తల దువ్వుకోబోతూ ఆగి.

''అన్నట్లు, స్టవ్ మీద కాఫీ వేడి చేసానే మీ ఇద్దరికీ యివ్వటానికి. కాస్త కప్పుల్లో పోసితే అమ్మా'' అంది.

''అలాగేలేవే'' విసుగ్గా అని లోపలికి వెళ్ళింది తాయారు.

అల్లుడు కుర్చీలో అసహనంగా కదులుతూ ''ఇంతకూ ఏం చేశారో చెప్పనేలేదత్తగారు. నేను టెన్షన్ భరించలేకపోతున్నానండీ. తొందరగా చెప్పకపోతే నా నరాలు తెగిపోయేలా ఉన్నాయి. మీరు చెప్పేకొద్దీ నా ఆకలి రెట్టింపవుతోంది'' అన్నాడు కుర్చీలోంచి లేస్తూ.

కాఫీ తీసుకు రావటానికి వెళ్ళిన తాయారు వంటింట్లోంచి పెద్దగా అరిచింది ''అమ్మా!'' అని.

''గిన్నె మాడిపోయిందే, కాఫీ లేదందులో'' అంది.

గబుక్కున లేచి నిలబడింది సుభద్రమ్మగారు.

''అయ్యో! నా మతిమరపు మండినట్లే ఉంది. ఇంట్లో యింక పాలు కూడా లేవు. పొద్దున్నే పిల్లికి పట్టించేశాను బలవంతంగా'' అంటూ ముసిముసి నవ్వులు నవ్వింది కుర్చీలో కూలబడుతూ.

కాఫీ లేదనగానే నిలబడిన అల్లుడు కూడా నీరసంగా చతికిలబడిపోయాడు కుర్చీలో.




''సరే, కనీసం టిఫినయినా పెట్టండి ఓ పట్టుపడతాను, స్నానం చేసి వచ్చి'' అన్నాడు ఆశగా.

''ఇంతకూ విను, స్నానం తర్వాత చేద్దువుగాని. పెసలు కూడా నానబోశానా, తీరా కరెంటుపోయింది. గ్రైండరు, మిక్సీ కూడా పనిచేయవుకదా! ఏం చెయ్యను నాయనా'' అంటూ లోపలికి వెళ్ళిపోయింది సుభద్రమ్మగారు. టిఫెన్ తయారుచేయటానికి అల్లుడు స్నానం చేసి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు ఆవురావురుమంటూ, అత్తగారు తీసుకుని రాబోయే టిఫెన్కై ఎదురు చూస్తూ.

అంతలో రెండు ప్లేట్లలో టిఫెన్ తెచ్చిందత్తగారు.

''ఆఖరికి ఇంత ఉప్మా కలిపి పడేశాను నాయనా. తినండి తినండి, ఎంత ఆకలి మీద ఉన్నారో'' అంది మంచినీళ్ళ గ్లాసులు కూడా తెచ్చి టేబుల్ మీద పెడుతూ.

''కాలే కడుపుకి మండే బూడిదని ఏదో ఒకటి యివ్వండి'' అంటూ ఆవిడ చేతుల్లోంచి బలవంతంగా ప్లేటు లాక్కుని ఆవురావురుమంటూ తిన్నాడు.

తాయారు కూడా ఏదో తిన్నాననిపించి లేచింది.

''నేను వంట చేసేలోగా మీరలా వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్ళి రండి'' అని పంపించింది సుభద్రమ్మగారు.

గుడి నుంచి వస్తూనే డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని, ''అత్తగారు ఎంతో కష్టపడి చాలా వెరైటీస్ చేసినట్లున్నారు మనకోసం. తాయారూ! కడుపునిండా తిను, నీ చేతి వంట తినలేక చచ్చాం'' అన్నాడు.

అత్తగారికేసి చూసి ''శాక పాకాలేమిటండీ'' అన్నాడు ఆత్రుతగా.

''తినబోతూ రుచెందుకూ'' అంది తాయారు.

కంచాల్లో పదార్థాలన్నీ వేస్తూ అంది అత్తగారు.

''ఆకుకూరల్లో ఐరన్ ఉంటుంది కదా అని తోటకూర కూర చేశాను. బలం కదా బాబూ! చారులేని భోజనం చేయకూడదని మా నాన్నగారనేవారు. అందుకని రసం చేశాను. తెలగపిండి వడియాలు కూడా వేయించానులే. భోజనం అయ్యాక పిండివంటలు ఎలాగూ తినాలి కదా! ఆహారం లైట్గా తీసుకుంటారని పెద్దగా ఏమీ చేయలేదు''

అత్తగారలా అనగానే కసిగా తాయారుకేసి చూశాడు జనార్దనం.

''ఆకుకూరలు బలం, అవును. తినవే తాయారూ బాగా తిను. పొట్టపగి

లేలా తిను'' అన్నాడు పళ్ళు బిగించి.

భోజనాలు చేసి టీవీ ఆన్ చేశారు. ఏదో టెలీ ఫిల్మ్ వస్తోంది సంక్రాంతి సందర్భంగా. హాస్యరస ప్రధానమైనది. ఆవిడ ప్రక్కగదిలో పిండి వంటలన్నీ రెండు ప్లేట్లలో సర్దుతోంది.

టీవీ చూస్తున్న జనార్దనం, ''సరే అత్తగారూ! ఆ పిండివంటలేవో యిలా పట్రండి, తాయారూ నేనూ తింటూ చూస్తాం'' అన్నాడు గట్టిగా.

లోపలికి వచ్చి ''ఈ మైసూర్‌పాక్ బుగ్గన పెట్టుకో బాబూ! రాత్రి భోజనం టైముదాకా నోట్లో పడుంటుంది పిచ్చిముండ'' అని ఇద్దరికీ చెరో మైసూర్‌పాక్ చేతికిచ్చింది.

తెల్లబోయి చూస్తూ అటూ ఇటూ తిప్పి చూశాడు ఆవిడెంతో ఆప్యాయంగా యిచ్చిన స్వీటుని.

''అత్తగారూ! దీని వాటం చూస్తుంటే మైసూర్ రాక్‌లా ఉంది'' అంటూ కొరకబోయాడు.

తాయారు గుడ్లప్పగించి చూస్తూండిపోయింది భర్త తిన్న తర్వాత తినవచ్చని.

''అమ్మో! పన్నూడిపోయిందత్తగారోయ్!'' అని పెద్ద పెట్టున అరిచాడు. నోటి వెంట నెత్తురు కూడా వచ్చింది.

అది చూసిన కూతురు ''ఇదేం మైసూర్ రాక్ తల్లీ! టీవీలో చూసి నేర్చుకున్నావా? మా ఆయనకేసి కొడితే నాకొచ్చి తగిలేట్టుంది. పదండి, డాక్టరు దగ్గరకు తీసుకువెళతాను'' అని భర్త జబ్బ పట్టుకుని లేవదీసి బయల్దేరింది.

వెళ్ళేముందు వెనక్కి తిరిగి ''అత్తగారూ రాత్రి భోజనమైనా కాస్త బాగా చేస్తారు కదూ! తెల్లవారగానే వెళ్ళిపోవాలి'' అన్నాడు చేత్తో దవడ పట్టుకుని.

అతని అవస్థ చూసి చాలా నొచ్చుకున్న అత్తగారు ''నా వంట తగలెయ్య, మీ పన్నూడగొట్టాను. మీ మావగారు యింట్లో లేకపోబట్టి నేనే చెయ్యవలసి వచ్చింది'' అంది బాధగా.

''బాధపడకండి. ఈసారి పండక్కి ఆయన ఉంటేనే వస్తాం, అవును కదా తాయారూ! సరేకానీ, రాత్రికి మంచి వంటకం మీకు బాగా చేతనైనదేదైనా చేయండి దయచేసి'' అన్నాడు.

''ఎంతమాట? ఆసుపత్రి నుంచి మీరలా లాగానే, యిలా మంచి ఫలహారం సిద్ధం చేయనూ? శనివారం కదా!'' అంది చిటికె వేస్తూ.

రాత్రి ఫలహారం టైముకి ఎదురు చూస్తున్నాడు జనార్దనం లొట్టలు వేస్తూ, అత్తగారేదో స్పెషల్ చేసి ఉంటారని.

ఇంతలో అత్తగారు వంటింట్లోంచి బయటికి వచ్చింది. చిన్న మొహం చేసుకుని నిలబడి ఉంది సుభద్రమ్మగారు, ఓ చేత్తో పైటకొంగు పదే పదే భుజం మీదికి లాక్కుంటూ, రెండో చేత్తో టిఫిన్ ప్లేట్ పట్టుకుని. మూతలు పెట్టి ఉండడం వల్ల ఏముందో కనిపించటం లేదు జనార్దనానికి. నోరూరిపోతూంది ఒక్కలా.

''అల్లుడూ! నాకు చాలా సిగ్గుగా ఉందోయ్! చపాతీ పిండి తడిపెట్టానయ్యా ఉదయమే. తీరా పన్నూడి నువ్వున్నావు ఎలా తింటావ్? కొబ్బరి, పెసరపప్పు వేసి పిండి చేద్దామనుకున్నాను. కానీ కొబ్బరిలో కొలెస్ట్రాల్ ఉంటుందని వూరుకున్నాను. పెసరపప్పు వేద్దామంటే పక్కింటి పిన్నిగారు వూరెళ్ళింది. అంచేత, ఉప్పూ జీలకర్ర వేసి యింత చప్పిడి పిండి కలియబెట్టానోయ్. ఆవకాయ, నెయ్యి వేసుకుని తింటే చాలా బాగుంటుందనుకో. ఈసారికిలా సరిపెట్టేసుకో'' అంది తాపీగా.

అల్లుడూ, కూతురూ నోరావలించి చూడసాగారు.

'ఏం చేస్తాం? మా దంతసిరి యిలా వుంది' అనుకున్నారిద్దరూ.

''తొందరగా తినండి చల్లారిపోతుంది. రథం ముగ్గు వేయడం కోసం చుక్కలెట్టుకుంటూ అలా ప్రక్కవీధి దాకా వెళ్ళానో లేదో ఇది గుర్తొచ్చి రావలసి వచ్చింది. కాస్త ఎక్కువగా కాలి పెచ్చుకట్టిందిలే వస్తానోయ్. మిగిలిన ముగ్గు పూర్తిచేసి రావాలి మరి. తెల్లవారిపోతుంది. మీరు తినేసి పడుకోండి'' అంది సుభద్రమ్మగారు.

ఆ మాటలను విని ''మా బండి అయిదు గంటలకేనండోయ్. మీరు అప్పటికీ రాలేకపోతే మేం తాళం చెవి ప్రక్కగూట్లో పెడతాము. చాలా మంచి ఆతిథ్యమిచ్చారు. అస్తమానూ పుట్టింటికి వస్తానంటుంది తాయారు. ఈ దెబ్బతో మరి పుట్టింటి మాటెత్తదు'' అని టిఫిన్ తినటం మొదలెట్టాడు.

తాయారు కూడా ప్లేటు చేతబుచ్చుకుని ''మా యిద్దరికీ కూడా గొప్ప శాస్తి చేశావమ్మా. సంక్రాంతి కొత్త అల్లుడినంటూ ఫోజులు కొడదామనుకున్న మా ఆయనకి అత్తారిల్లంటే భయం పట్టుకునేలా చేశావ్. తెనాలి రామలింగడి పిల్లిలా అయింది ఆయన పరిస్థితి. నువ్వెళ్ళి ముగ్గేసుకో'' అని తినటంలో లీనమైపోయింది.

☆



## ఆనందం

**సోగకళ్ల కాజోల్ నటించిన చిత్రాలన్నీ ప్రేక్షకుల్ని అలరించాయి. కొత్త చిత్రం కభీ అల్విదా నా కెహ్నాలో నటిస్తున్న కాజోల్ ఈచిత్రానికి సంబంధించిన ఓ పాట చిత్రీకరణలో పాల్గొంది. అమితాబ్, అభిషేక్ బచ్చన్‌లు ఈ చిత్రంలో నటిస్తున్నారు. 'ఏ చిత్రంలోనైనా నటిస్తే ఆ చిత్రం పూర్తి సక్సెస్ కావడానికి మన పాత్ర చాలా ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త చిత్రాల్లో నటిస్తూ కొత్త పాత్రల్ని పోషిస్తుంటే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది' అంటోంది కాజోల్.**